యాదగిరీశుడికి ఘనంగా నిత్యోత్సవాలు

ఊంజల్ సేవలో భాగంగా అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 26 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో స్వయంభువుగా వెలిసిన నారసింహస్వామికి సుప్రభాతం నుంచి పవళింపు సేవ వరకు నిత్య కైంకర్యాలు పాంచరాత్రాగమశాస్త్రం ప్రకారం ఘనంగా జరిగాయి. శుక్రవారం తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవను నిర్వహించారు. తిరువారాధన నిర్వహించి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. సుదర్శన నారసింహ హోమం పాంచరాత్రాగమ శాస్త్ర రీతిలో సాగింది. ఆలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ సుదర్శన నారసింహ హవనం జరిపారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహన సేవను చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు నిత్య తిరు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని వీక్షించారు. ఆలయ ముఖ మండపంలో సువర్ణమూర్తులకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చన కార్యక్రమాలు సాగాయి. సాయంత్రం నిర్వహించిన స్వామి, అమ్మవార్ల తిరువీధి సేవ, దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. అద్దాల మండపంలో ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవను కోలాహలంగా నిర్వహించారు. ముత్తయిదువులు మంగళ హారతులతో అమ్మవారిని స్తుతిస్తూ పాటలు పాడుతూ సేవ ముందు నడిచారు. తిరువీధిసేవ అనంతరం అమ్మవారిని అద్దాల మండపంలోని ఊయలతో శయనింపు చేయించారు. పరమ పవిత్రంగా నిర్వహించే సేవలో మహిళా భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా సాగాయి. స్వామివారిని సుమారు 7వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.9,55,518 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధి బాగుంది

● టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి


మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 25 : గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధి బాగుందని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. దండుమల్కాపురంలోని ట్రిఫ్ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్కులో ఏర్పాటు చేసిన ఎన్విరో ప్లూయిడ్స్ పరిశ్రమను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్కును సందర్శించి వివిధ రకాల పరిశ్రమలను పరిశీలించారు. పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. పార్కు ఏర్పాటు నేపథ్యాన్ని ట్రిఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొండవీటి సుధీర్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆనంతరం పార్కులో అవసరమైన నీటి సరఫరా, 132కేవీ సబ్‌స్టేషన్, రవాణా సదుపాయం, ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ సమకూరుస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ట్రిఫ్ సెక్రటరీ గోపాల్‌రావు, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ సంతోష్, పారిశ్రామికవేత్తలు గోవిందరెడ్డి, స్వామిగౌడ్, యాదయ్య, వెంకటేశ్వర్ రెడ్డి, రమేశ్, శ్రీనివాస్, రవినాయక్ పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలం పరిశీలన

● భూమి కబ్జా ఆరోపణలపై స్పందించిన తాసీల్దార్

యాదగిరిపల్లిలో క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న ఇన్‌చార్జి తాసీల్దార్ దేశ్యా

యాదగిరిగుట్ట, అక్టోబర్ 25 : అక్రమంగా మ్యుటేషన్ చేసి శ్మశానవాటికను కబ్జా చేస్తున్నారన్న ఆరోపణలపై ఇన్‌చార్జి తాసీల్దార్ దేశ్యా స్పందించారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని యాదగిరిపల్లిలో సర్వే నంబర్ 152లో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల పలువురిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. గతంలో భూమి వివరాలు, ప్రస్తుత క్రయవిక్రయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్ 152లో దండు విజయలక్ష్మి పేరిట 2.02 ఎకరాల భూమి ఉందని పట్టాదారు పాసు పుస్తకం జారీ చేయాలని దరఖాస్తు చేసుకున్నారన్నారు. దానికి సంబంధించిన మ్యుటేషన్‌ను నిలిపివేసి విచారణ చేపడుతున్నామని తెలిపారు. సర్వే నివేదిక అనంతరం తుదిపరి చర్యలు తీసుకుంటామన్నారు.

పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నాం : సందీప్‌కుమార్

తన తల్లి దండు విజయలక్ష్మి పేరిట గతంలో 6.03 ఎకరాల భూమి ఉండేదని, అందులో 4ఎకరాల భూమి విక్రయించగా మరో 2.02 ఎకరాల భూమి ఆమె పేరిట ఉందని పట్టాదారు దండు విజయలక్ష్మి కుమారుడు సందీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం యాదగిరిగుట్టలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 2006 నుంచే ఇందుకు సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు, అధికారులు మారినా పట్టాదారు పాసుపుస్తకం రాలేదన్నారు. 2.02 గుంటల భూమిపై తమకు ఉన్న హక్కు పత్రాలను తాసీల్దార్‌కు సమర్పించామని చెప్పారు. సర్వే నిర్వహించి తమకు న్యాయం చేయాలని తాసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నామన్నారు..

రాజాపేట గొలుసుకట్టు చెరువులు నింపాలి : బీఆర్ఎస్

కాశేశ్వరం కాల్వను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రాజాపేట, అక్టోబర్ 25 : కాశేశ్వరం 15వ ప్యాకేజీ ద్వారా రాజాపేట మండలంలోని గొలుసుకట్టు చెరువులు నింపి సాగునీరు అందించి ఇక్కడి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. జగదేవపురం మండలంలోని గంధమల్ల వద్ద ఉన్న కాశేశ్వరం ప్రాజెక్టు కాల్వను బీఆర్ఎస్ పార్టీ నాయకులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం రాజాపేట మండలానికి సాగు జలాలు అందించాలనే ఉద్దేశంతో కాశేశ్వరం 15వ ప్యాకేజీకి రూ.12 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఆ నిధులతో కొంత మేర కాల్వ పనులు చేపట్టారని తెలిపారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సొంత నిధులతో ఆ కాల్వ పనులు చేపడుతామని చెప్పి 20 రోజులు గడుస్తున్నా నేటికీ తట్టెడు మట్టి తీసిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాట ప్రకారం మండలనికి సాగు జలాలు అందించి గొలుసుకట్టు చెరువులు నింపి చిత్తశుద్ధి చాటుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, మాజీ జడ్పీటీసీ గోపాల్ గౌడ్, నాయకులు చింతలపూరి వెంకట్‌రాంరెడ్డి, గుంటి మధుసూదన్‌రెడ్డి, ఎడ్ల నరేశ్‌రెడ్డి, కాకల్ల ఉపేందర్, గుంటి కృష్ణ, ధర్మేందర్‌సింగ్, నరేందర్, నర్సింహారెడ్డి, వీరేశం, వెంకటేశ్వర్‌రెడ్డి, కిషన్, జశ్వంత్, ఉప్పలయ్య గౌడ్, యాదగిరిగౌడ్, కనకయ్య, రమేశ్ పాల్గొన్నారు.

జవాన్ రవికుమార్ కుటుంబానికి ఆర్థిక సాయం

భువనగిరి అర్బన్, అక్టోబర్ 25 : పట్టణానికి చెందిన తాండ్ర రవికుమార్ హిమాచల్ ప్రదేశ్‌లో ఇండో టిబెటన్ బార్డర్ పోలీస్ ఫోర్స్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన ఈ నెల 21న అనారోగ్యంతో మృతిచెందాడు. రవికుమార్ కుటుంబ సభ్యులకు పారా మిలటరీ ఐటీబీపీ తెలుగు జవాన్స్ తరపున రూ.71వేలు, ఖమ్మం సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ తరపున రూ.10వేలు, రిటైర్డ్ ఐటీబీపీ బ్యాచ్‌మెంట్స్ తరపున రూ.31వేలు, పట్టణ సీఐ సురేశ్‌కుమార్ రూ.2వేలను శుక్రవారం అందజేశారు. అనంతరం రవికుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ట్రిపుల్ ఆర్‌కు మా భూములు ఇవ్వం

● అవార్డు విచారణను బహిష్కరించిన భూ నిర్వాసితులు

చౌటుప్పల్, అక్టోబర్ 25 : ట్రిపుల్ ఆర్ నిర్మాణానికి తమ భూములు ఇవ్వబోమని భూ నిర్వాసితులు పేర్కొన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు భూ సేకరణలో భాగంగా తాసీల్దార్ కార్యాలయంలో మూడో రోజు శుక్రవారం చేపట్టిన అవార్డు విచారణను చౌటుప్పల్, లింగోజిగూడెం గ్రామాల భూ నిర్వాసితులు బహిష్కరించారు. 3జీ నోటిఫికేషనల్‌లో భాగంగా బాధితుల బ్యాంకు ఖాతా వివరాలు, పాన్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జీరాక్స్ కాపీలను సేకరించేందుకు ఆర్డీఓ వి.శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశాన్ని బాధిత రైతులు బహిష్కరించి తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. రీజనల్ రింగ్ రోడ్డుకు తమ భూములు ఇవ్వబోమని ఆర్డీఓకు రైతులు తెగేసి చెప్పారు. తక్షణమే అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ ఆర్‌కు నాలుగు ప్రధాన రహదారులను 40కిలోమీటర్లు దూరం కేటాయించి, ఇక్కడ 28కిలోమీటర్లకు కుదించి తమకు అన్యాయం చేశారని పేర్కొన్నారు. దాంతో చౌటుప్పల్ మున్సిపాలిటీ రెండుగా విడిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ఎండీఏ వెంచర్‌లో సైతం ప్లాట్లు, ఇండ్లు పోతున్నాయన్నారు. బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం లేదా భూమికి బదులు భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. అక్కడి నుంచి వెళ్లిన రైతులు 65వ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. పోలీసులు వచ్చి ఆందోళనను విరమింపజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, భూ నిర్వాసితులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, దబ్బేటి రాములుగౌడ్, సందగళ్ల మల్లేశం గౌడ్, బోరెం ప్రకాశ్‌రెడ్డి, మునుకుంట్ల సత్యనారాయణ గౌడ్, జాల శ్రీశైలం యాదవ్, జాల వెంకటేశం యాదవ్, చింతల సుధాకర్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, శివగౌడ్, గాలయ్య యాదవ్, వేణు యాదవ్ పాల్గొన్నారు.

అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ రద్దయ్యే వరకు పోరాటం

రామన్నపేట, అక్టోబర్ 25 : మండల కేంద్రంలో ఏర్పాటు చేయతలపెట్టిన అంబుజా సిమెంట్ పరిశ్రమను రద్దు చేస్తామని ప్రకటన వచ్చే వరకు పోరాటం చేస్తామని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు, మాజీ ఎంపీటీసీ సాల్వేరు అశోక్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న అంబుజా సిమెంట్ కంపెనీపై నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ నివేదికను ఉన్నది ఉన్నట్లుగా పంపించాలన్నారు. మండల ప్రజల ఆవేదన, బాధను ప్రభుత్వం గుర్తించి సిమెంట్ కంపెనీ ఏర్పాటును రద్దు చేస్తున్నామని వెంటనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

అలైన్‌మెంట్ మార్చాల్సిందే

● భువనగిరిలో అవార్డు మీటింగ్‌ను బహిష్కరించి రైతుల ఆందోళన

ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ట్రిపుల్ ఆర్ బాధిత రైతులు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 25 : రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఆర్ భూ సేకరణలో భాగంగా పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అవార్డు మీటింగ్‌ను బాధిత రైతులు బహిష్కరించారు. మండలంలోని తుక్కాపురం, గౌస్‌నగర్, రాయగిరి గ్రామాల రైతులతో నిర్వహించిన ఈ సమావేశానికి ఎవరూ హాజరు కాలేదు. ఆర్డీఓ అమరేందర్ ఒక్కరే హాజరై నాలుగు గంటల పాటు వేచి చూశారు. బాధిత రైతులు లోపలికి రాకుండా గేటు వద్దే ఉండి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఔటర్ రింగ్ రోడ్డుకు 40 కిలోమీటర్ల దూరంలో ట్రిపుల్ ఆర్ నిర్మించాల్సి ఉండగా.. ఇక్కడ 28 కిలోమీటర్ల దూరంలోనే నిర్మిస్తూ పేద రైతుల భూములు లాక్కుంటున్నారని మండిపడ్డారు. అలైన్‌మెంట్ మార్చకుండా నిర్మాణం జరిగితే చిన్న, సన్నకారు రైతులే ఎక్కువగా భూములు కోల్పోతారని, అవి పోతే తమకు జీవనోపాధి లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చేలా చూడాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలైన్‌మెంట్‌ను మార్చకుంటే గజం స్థలం కూడా ఇవ్వబోమని తేల్చిచెప్పారు. ఈ అవార్డు సమావేశం రెండు, మూడ్రోజులు కొనసాగుతుందని, రైతులు ఒప్పుకొని తమ భూములకు సంబంధించిన పాస్‌బుక్, పేపర్లను అందించాలని ఆర్డీఓ అమరేందర్ కోరారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరుగదని, ప్రభుత్వం మంచి రివార్డులు ప్రకటిస్తుందని చెప్పారు. అయినా.. రైతులు వినిపించుకోకుండా గ్రామాలకు వెళ్లిపోయారు.

ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

● తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, అక్టోబర్ 25 : రైతు పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్‌లో ఎఫ్ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సన్న వడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. దళారుల మాటలు నమ్మి ప్రైవేట్ కాంటాల వద్ద ధాన్యం అమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు, మార్కెట్ సెక్రటరీ ఉమామహేశ్వర్, సొసైటీ సీఈఓ కొణతం వరలక్ష్మి, నాయకులు పైళ్ల సోమిరెడ్డి, అవిలి మల్లు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత అధ్యక్షతన శుక్రవారం జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రోడ్డు నిర్మాణం వల్ల దుమ్ము లేస్తుందని, దాంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాజన్నగూడెంలో రోడ్డుపై దుమ్ము లేవకుండా నీళ్లు పోయించాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, కమిషనర్ శ్రీకాంత్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

బస్వాపురం ప్రాజెక్టుకు రూ.500 కోట్లు కేటాయించాలి

● నిర్వాసితులకు నష్టపరిహారం పూర్తి స్థాయిలో చెల్లించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

భువనగిరి మండల మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 25 : బస్వాపురం రిజర్వాయర్‌కు 500 కోట్ల రూపాయలు కేటాయించి పనులు వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. మండలంలోని వడపర్తి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సీపీఎం మండల 8వ మహాసభలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించకపోవడంతో బస్వాపురం రిజర్వాయర్ నిర్మాణం పూర్తి కావడం లేదని, నిధులు ఎప్పుడు విడుదల చేస్తారో చెప్పాలని అన్నారు. ముంపునకు గురవుతున్న బీఎన్ తిమ్మాపురం, లప్పానాయక్‌తండా, చొక్లాతండా బాధితులను, బస్వాపురం గ్రామంలో భూములు కోల్పోయిన వారికి పూర్తిగా నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఇండ్లు కోల్పోయిన వారికి ఇండ్ల నిర్మాణం చేపట్టి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. వడపర్తి కత్వను వెడల్పు చేసి భువనగిరి పెద్ద చెరువు, బీబీనగర్ చెరువులను నింపి జిల్లాలోని 9 మండలాలకు సాగునీరు అందించాలన్నారు. బస్వాపురం ప్రాజెక్టు పూర్తి చేసి బునాదిగాని కాల్వ ద్వారా గోదావరి జలాలు అందిస్తే మూసీ కాలుష్యాన్ని నివారించవచ్చని తెలిపారు. భూమిలేని పేదలకు మూడెకరాల భూమి ఇవ్వాలని, అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాసభలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి పాండు, మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, పీఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు, పార్టీ నాయకులు అన్నంపట్ల కృష్ణ, కొండ అశోక్, కొండమడుగు నాగమణి, ఎల్లయ్య, వెంకటేశ్, మైసయ్య, యాదగిరి, కుమారి, మల్లేశ్, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మండల్లగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సింగిల్ విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 25 : మండలంలోని స్వాములవారి లింగోటం, నేలపట్ల, మందల్లగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తక్కువ తేమతో ఉన్న ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగరాజు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య, నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, ఢిల్లీ మాధవరెడ్డి పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం : ఎంఈఓ

ల్యాబ్ పరికరాల పంపిణీలో పాల్గొన్న ఎంఈఓ గురువారావు

చౌటుప్పల్, అక్టోబర్ 25 : ప్రభుత్వ బడులకు దాతలు సహకరించడం అభినందనీయమని ఎంఈఓ గురువారావు అన్నారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు సుమారు రూ.40లక్షల విలువైన ల్యాబ్ పరికరాలను దివీస్ కంపెనీ ప్రతినిధులు శుక్రవారం చౌటుప్పల్ హైస్కూల్‌లో అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ సైన్స్ పరికరాలు విద్యార్థులకు ప్రాక్టికల్స్‌లో ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. దివీస్ పరిశ్రమ పిల్లలకు బ్యాగులు, వాటర్ బాటిల్స్, నోట్ బుక్స్, షూస్ అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, దివీస్ పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్

చౌటుప్పల్, అక్టోబర్ 25 : 15 కేసుల్లో సంబంధమున్న నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. కొత్తగూడెం జిల్లా జూలూరుపాడుకు చెందిన కారం నరేశ్ పలు కేసుల్లో నిందితుడు. అతనిపై చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, చివ్వెంల, సూర్యాపేట రూరల్, రాఘునాథపల్లి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. అతడిని చౌటుప్పల్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

బాబా వేషధారణలో మోసం

● రూ.38వేలు అపహరణ

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 25 : మండలంలోని సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని షేర్‌బావి వద్ద బాబా వేషధారణతో గుర్తు తెలియని వ్యక్తులు రూ.38వేలు అపహరించుకుపోయారు. బాధితుల వివరాల ప్రకారం.. షెర్‌బావి వద్ద నివాసం ఉంటున్న వాకిటి మల్లారెడ్డి ఇటీవల కొత్త ఇంటిని నిర్మించుకున్నాడు. శుక్రవారం గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై బాబా వేషధారణలో వచ్చి 'మీ ఇంటికి దోషం ఉన్నది.. కీడు ఉన్నది. దాంతో మీ కొడుకుతోపాటు మీకు ప్రమాదం జరిగేటట్టు ఉన్నదని నమ్మబలికారు. రూ.4వేలు ఇస్తే మీ ఇంటికి మంచి చేసి పోతామని తెలిపారు. తమ దగ్గర అన్ని డబ్బులు లేవు.. వెళ్లిపోండని మల్లారెడ్డి దంపతులు చెప్పారు. అయినా వారు వినకుండా రెండు తాయత్తులను మల్లారెడ్డి దంపతులకు ఇచ్చి వారి వద్ద ఉన్న బూడిదను మొహంపై చల్లారు. ఆ వెంటనే ఇంట్లో ఉన్న 38,500 రూపాయలను తెచ్చి దొంగ బాబాలకు ఇచ్చారు. 5నిమిషాలకు తేరుకున్న మల్లారెడ్డి దంపతులు మోసపోయామని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓ సోలోమాన్‌రాజ్ తెలిపారు.

బెల్ట్ షాపుపై దాడి

చౌటుప్పల్, అక్టోబర్ 25 : మండలంలోని జైకేసారం గ్రామంలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పందుల సుగుణమ్మను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఆమె వద్ద రూ.5వేల విలువైన బీరు బాటిళ్లు, క్వాటర్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలి

ఆలేరు టౌన్, అక్టోబర్ 25 : రైతులు పండించిన పత్తిని సీసీఐ ద్వారా కొనుగోలు చేసి మద్దతు ధర అందించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎంఏ ఇక్బాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్తి పంట వస్తున్నా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం శోచనీయమన్నారు. పత్తిని ఎక్కువ కాలం నిల్వ ఉంచడం వల్ల రంగు మారుతుందని, దాంతో రైతులు నష్టపోతారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోళ్లు ప్రారంభించి క్వింటాకు రూ.10వేల మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మొరిగాడి రమేశ్, వడ్డేమాన్ బాలరాజు, గనగాని మల్లేశ్, తాళ్లపల్లి గణేశ్, కాసుల నరేశ్ పాల్గొన్నారు.

బెల్ట్ షాపుపై దాడి

చౌటుప్పల్, అక్టోబర్ 25 : మండలంలోని జైకేసారం గ్రామంలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పందుల సుగుణమ్మను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఆమె వద్ద రూ.5వేల విలువైన బీరు బాటిళ్లు, క్వాటర్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● కలెక్టర్ హనుమంతు కె.జెండగే

విద్యార్థులకు షూస్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి అర్బన్, అక్టోబర్ 25 : దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. పట్టణంలోని తాతానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నవభారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అందజేసిన షూస్‌ను విద్యార్థులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల, ఏకాగ్రతతో చదివి ఉన్నత ర్యాంకులు సాధించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ధనుంజనేయులు, 12వ వార్డు కౌన్సిలర్ ఊదరి లక్ష్మి, ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు లోకియానాయక్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పచ్చదనం పెంచి పరిశుభ్రతను పాటించాలి

● జడ్పీ సీఈఓ శోభారాణి

ఆత్మకూరు(ఎం) కస్తూర్బా పాఠశాలలో కూరగాయలను పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ శోభారాణి

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 25 : ప్రతి పాఠశాలలో పచ్చదన